పిల్లలు ఆ మాత్రం ఈ మాత్రం పెద్దవాళ్లు అయినా వారిని కాచుకోవడం భార్యభర్తలకు కష్టమే అయింది. ఫ్రూటీ కావాలని, సమోసాలు కావాలని, కామిక్సుబుక్స్ కావాలని వారు మారాంచేశారు.

"నా మాట విన్నారా? హాయిగా ఇంటి దగ్గర ఇంత టిఫిన్ చేసి వీళ్ళకింత పడేస్తే వీళ్లు ఇలా నానాగడ్డీ కొనమనేవాళ్ళా?'. విసుక్కుంది అరుణ.

ఎట్టకేలకు రైలు వచ్చింది. వాళ్ళ అదృష్టం బాగుంది. వాళ్ళెక్కిన బోగీలో ఒక బెర్తు ఖాళీ అయింది. ఆ బోగీలో ఇసుక వేసినా రాలనంత మంది జనం వున్నా తాము నిలబడిన దగ్గరే బెర్తు ఖాళీ అయింది.

"సువర్ణా! నువ్వూ, రమణీ ఆ కిటికీ దగ్గరకూర్చోండి. వాటర్ బాటిల్ మీ పక్క పెట్టుకోండి. ఒరే రామం నువ్వు వాటర్ బాటిల్‌కీ ఇటువైపు కూర్చో. మీ అమ్మ సీటు చివర కూర్చుంటుంది. మీ ఇద్దరి మధ్యనా నేను కూర్చుంటాను" ఆ బెర్తులో మరెవరూ చేరకూడదన్న అభిప్రాయంతో శంకరరావు అన్నారు.

ఒకరిద్దరు ఆ సీటులో కూర్చోవాలని ప్రయత్నించినా వారికి జాగా ఇవ్వలేదు. రెండు బ్రీఫ్‌కేసుల్ని బెర్తుకింద కిటికీవైపు పెట్టి చైన్ లాక్‌వేశాడు. షాపర్‌బేగ్ తన కాళ్ళ దగ్గర వుంచుకున్నాడు.

రాయపూర్‌లో దిగినవాళ్ళు తక్కువ. ఎక్కినవాళ్లు ఎక్కువ. మిగతా సీట్లలో ఏడుగురు ఎనమండుగురు సర్దుకు కూర్చున్నా "మేం దూరప్రయాణం చేయాలి. ఇప్పటికే నలుగురి జాగాలో అయిదుగురం కూర్చున్నాం" అంటూ ఎవరూ తమ బెర్తుమీదకు రాకుండా అడ్డుకుంటున్నాడు శంకరరావు.

రాయపూర్‌లో ఎక్కినవారిలో ఒక సర్దార్జీ అతని భార్య కూడా వున్నారు. ఆమె చంకలో నాలుగేళ్ళ పాప.

"ఏమండీ! ఆ ఆడమనిషి పిల్లతో వుంది. కొంచెం జరగండి. చోటిద్దాం" అంది భర్తతో అరుణ.

"వేలు చూపితే మండ నాకుతారు. నువ్వు జాలిపడి ఆమెకు చోటిస్తే మరికొంతసేపటికి ఆమె తన భర్తను కూడా కూర్చోమంటుంది. అప్పుడు మనం ఇబ్బంది పడతాము" అన్నాడు శంకరరావు.

సర్దార్జీ పెట్టె అంతా కలియతిరిగి ఎక్కడా స్థలం లేదని తెలుసుకున్నాడు. పిల్లతో నిలబడలేకపోతున్నది అతని భార్య. గర్భవతి కూడాను.

"మాస్టారూ! కొంచెం అటు జరుగుతారా? మా ఆవిడ నిల్చోలేకపోతున్నాది? అంటూ ప్రాధేయపడ్డాడు సర్దార్జీ.

అందరికీ చెప్తూ వస్తున్న జవాబునే సర్దార్జీకి కూడా చెప్పాడు శంకరరావు హిందీలో.

"నా కోసం అడగటంలేదు. ఆ భార్య ఉత్తమనిషి కాదు. ప్లీజ్ కొంచెం సర్దుకోండి" తిరిగి అభ్యర్థించాడు.

అరుణకు జాలివేసింది. గతంలో తాను చేసిన రైలుప్రయాణాలు గుర్తుకి వచ్చాయి. గర్భిణీ స్త్రీ ఎంత సేపు నిల్చుని ప్రయాణం చేయగలదు. భర్త వంక చూసింది.

శంకరరావుకి గతంలో కొన్ని రైలు ప్రయాణాలు గుర్తుకి వచ్చాయి. తానూ అప్పుడు ఈ సర్దార్జీలాగే బ్రతిమాలేడు. కానీ తనకెవరైనా ఒక్క సీటు ఇచ్చారా?

"మరోచోట ప్రయత్నించండి. ఇంత పెద్ద బండిలో జాగా దొరక్కపోదు." అన్నాడు.

సర్దార్జీ ఇంకా ఏదో అనబోతూ వుండగా అతని భార్య వారించింది. సర్జార్జీ పంజాబీలో ఆమెకేదో సమాధానం చెప్పి మరి శంకరరావుతో మాట్లాడలేదు.

రైలు ప్రతి చిన్నస్టేషనులోనూ ఆగుతూ మహాసముంద్ చేరింది. శంకరరావు ఎదుటిసీటులో ఇద్దరికి సరిపడ జాగా ఖాళీ అయింది.

సర్దార్జీ అతని భార్యా వాటిని ఆక్రమించారు. అరుణకు చాలా సంతోషం కలిగింది.

కాంటాబంజీ రాగానే కొంతమంది ఎక్కారు. అలా ఎక్కినవారిలో ప్రభాకరరావు కూడా వున్నాడు. బండి రద్దీగా ఉన్నా ప్రభాకరరావు దృష్టి శంకరంమీద పడింది.

"శంకరం! నువ్వా?" అన్నాడు ప్రభాకరరావు.

"ప్రభాకరం! ఎంతకాలానికి కలిసేము" సంతోషంగా అన్నాడు శంకరరావు.

"మా ఆవిడ ఎంత చెప్పినా వినలేదు. ఒకటి రెండు రోజులు ఆలస్యంగా అయినా రిజర్వేషన్ చేయించుకొని బయలుదేరదామంటే వినలేదు. రైల్లో చూస్తే జాగాలేదు. ఎలా ప్రయాణం చేస్తామో?" అన్నాడు.

శంకరరావు సర్దుకొని, ప్రభాకరరావుని అతని భార్యను, కుమారుడిని తమ బెర్తుమీద కూర్చోపెట్టాడు.

"థాంక్సరా!" అన్నాడు ప్రభాకరరావు.

"వీళ్ళు మీ చుట్టాలా?" ప్రశ్నించాడు సర్దార్జీ శంకరరావును.

"అబ్బేకాదు. ఒకే ఊరివాళ్ళం. కొంతకాలం కలసి పనిచేశాము" అన్నాడు. సర్దార్జీ ఇంకా ఏమో అనబోతూ వుంటే అతని భార్య మళ్ళీ వారించింది.

టిట్లాఘర్‌లో బండి ఆగగానే ప్రభాకరరావు కిందకు దిగి ఆరు అరటిపళ్లు కొని తెచ్చి భార్యకు మూడు ఇచ్చాడు. వాళ్ళు అరటిపళ్లు తింటూ వుంటే రమణి "నాన్నా! అరటిపళ్ళు" అంటూ అడిగింది.

"తింటున్నవన్నీ చాలవా? అయినా రైలుబయలుదేరుతోంది. పెట్టెలోనికి వస్తే కొనుక్కుందాం" అన్నాడు శంకరరావు.

అరుణ కేరేజీలో పులిహోర తీసి పిల్లలకిచ్చింది. భర్తకు ఇస్తే "అరుణా! వీళ్ళకూ ఇస్తావా?" అన్నాడు ప్రభాకరరావు దంపతులను చూపిస్తూ.

"వద్దు. మేం ఇంటిదగ్గర భోజనంచేసే బయలుదేరాము" అంది ప్రభాకరరావు భార్య అరటిపళ్ళతొక్కలను కిటికీలోంచి పారేస్తూ.

మరికొంతసేపు పోయిన తరువాత సర్దార్జీ సంచీలోంచి అరటిపళ్ళు తీసి పిల్లలందరికీ చెరొకటి ఇచ్చాడు. శంకరావు వద్దు వద్దంటున్నా పిల్లలు తీసుకున్నారు. మరో స్టేషనులో డెబ్బైఏళ్ళ ముసలిది వీరి బెర్తులదగ్గర నిలబడింది.

"అవ్వా! ఇలా వచ్చి కూర్చో" అన్నాడు సర్దార్జీ.

"చోటెక్కడుంది బాబూ!" అంది ఆమె.

"ఫరవాలేదు. నువ్వు కూర్చో. నేను నిలబడాను." అన్నాడు సర్దార్జీ సీటులోంచి లేచి.

శంకరరావుకది నచ్చలేదు. బహుశా అతను వచ్చే స్టేషనులో దిగిపోతాడు అందుకే ఈ దాతృత్వం అని అనుకున్నాడు. అయినా ఆ సర్దార్జీ పక్క స్టేషనులో కానీ ఆ పక్కస్టేషనులో కానీ దిగలేదు.

బొబ్బిలి ఏడున్నరకు చేరవలసిన సమతా అర్ధరాత్రి రెండుగంటలకు వచ్చింది. శంకరరావు అతని కుటుంబం, ప్రభాకరరావు అతని కుటుంబం, సర్దార్జీ అతని భార్యాపిల్లలూ బొబ్బిలిలోనే దిగారు.

"ఏమండి! వాటర్ బాటిల్ రైల్లో వుండిపోయింది" అంది అరుణ భర్తతో.

శంకరరావు రైలు ఎక్కాడు వాటర్‌బాటిల్‌కోసం. అతను దిగకముందే రైలు వేగం పుంజుకుంది. శంకరరావు గాబరాపడ్డాడు.

"అరుణా! నేను విజయనగరంలో దిగి రేపు బస్సులో వస్తాను" అంటూ అరిచాడు.

అరుణకేం పాలుపోలేదు. ఈ పిల్లలతో ఆ రాత్రి ఎలా గడపడం?

ప్రభాకరరావుభార్యవంక దీనంగాచూసింది.

"చెల్లెమ్మా! బెంగపడకు శంకరరావు ఉదయాన్నే వస్తాడు. మేం వస్తాం" అంటూ

ప్రభాకరరావు ఓవర్ బ్రిడ్జివైపు బయలుదేరాడు. సర్దార్జీ అంతా చూస్తున్నాడు. భార్యతో ఏదో చెప్పాడు.

"మీరీ రాత్రి ఒంటరిగా స్టేషనులో ఎలాగుంటారు? మీరు మా ఇంటికి రండి" అంది సర్దార్జీ పెళ్ళాం.

"ఆయన ఉదయం మాకోసం వెతుక్కుంటారు. మేం ఎలాగో వెయిటింగ్ హాలులో ఈ రాత్రి గడిపేస్తాం" అంది అరుణ.

"అయ్యో! అంత ఖర్మ ఎందుకు? మావారు ఉదయం కాంప్లెక్స్‌కి వెళ్ళి మీ వారిని క్షేమంగా ఇంటికి తీసుకువస్తారు. టిఫిన్‌చేసి బయలుదేరండి. నేను చేసిన ఉప్మా ఎలాగుంటుందో మీరు తిని చెప్పాలి" అంది నవ్వుతూ సర్దార్జీ భార్య.

పిల్లలు "అమ్మా! వారింటికి వెళ్దాం" అన్నారు.

మర్నాడు శంకరరావు బస్సు దిగేసరికి సర్దార్జీ ప్రత్యక్షమయ్యాడు.

"సర్దార్జీ! మీరిక్కడా? నా భార్య పిల్లలూ స్టేషనులో వుంటారు. వస్తాను" అన్నాడు.

సర్దార్జీ శంకరం భుజంమీద చెయ్యివేసి "వాళ్ళు మా ఇంటిలో వున్నారు. మీ స్నేహితుడు రైలు దిగగానే వెళ్ళిపోయాడు. పదండి మా ఇంటికి" అన్నాడు.

అతని స్కూటరుమీద శంకరరావు ఎక్కాడు. అతడి మనసు చల్లబడింది.

తను సర్దార్జీతో అంతకుముందు ఎంత దురుసుగా ప్రవర్తించాడు.

రైలు ఏ ఒక్కరి సొత్తూ కాదు. పరిచయాలు లేకున్నా ఓ నాలుగు గంటలు లేదా ఒకరోజు కలసి ప్రయాణం చేస్తాము. ఇతరులకు సహాయపడే గుణం మనిషి ఔన్నత్యాన్ని పెంచుతుంది. స్వార్థంవలన మంచితనానికి గ్రహణం పడుతుంది అనుకున్నాడు శంకరరావు.

**- స్వాతి సపరివారపత్రిక 7.08.1998**